

రంగస్వామికి జలాభిషేకం

వెంకటాపురంలో వెలిసిన గుంటి రంగస్వామికి జలాభిషేకం చేశారు. ఏటా శ్రావణ మాసంలో స్వామికి తుంగా జలాలతో అభిషేకం చేయడం ఆనవాయితీ.

8లో▸



4.25 కిలోల బరువుతో..

కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో ఓ మహిళ సాధారణ కాన్పులో 4.25 కిలోల బరువు ఉన్న మగ శిశువుకు జన్మనిచ్చింది. శిశువు ఆరోగ్యంగా ఉన్నారు.

8లో▸



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	:1,633 అడుగులు
ప్రస్తుతం	:1,625.43
టీఎంసీల సామర్థ్యం	:105.788
ప్రస్తుతం	:77.907
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	:46,500
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	:50,000

న్యూస్‌రీల్

'క్షయ' నిర్మూలనే లక్ష్యం



రికార్డులను తనిఖీ చేస్తున్న డాక్టర్ శారదాభాయ్

ఆత్మకూరు: క్షయవ్యాధి నిర్మూలనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని నంద్యాల జిల్లా లెప్రసీ ఎయిడ్స్ మరియు క్షయ నివారణ అధికారిణి డాక్టర్ శారదాభాయ్, డాక్టర్లు పవన్‌కుమార్ అన్నారు. ఆత్మకూరు పట్టణంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రోగుల వివరాలు, రికార్డులను తనిఖీ చేశారు. స్థానిక ఆసుపత్రిలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. క్షయ వ్యాధిగ్రస్తులకు కేంద్రం అమలు చేస్తున్న ప్రధానమంత్రి నిక్షయ్ పోషణ యోజన కింద ప్రతి నెలా రూ.1000 బ్యాంకు ఖాతాలో జమవుతుందన్నారు. అంతేకాకుండా ఆరు నెలలపాటు వారిని దత్తత తీసుకుని పౌష్టికాహారం అందజేయడం జరుగుతుందన్నారు. సీహెచ్‌సీ ఆఫీసర్ అహ్మద్‌బాషా, ఆరోగ్య కార్యకర్త ఇందిర ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

బానకచెర్ల నుంచి నీరు విడుదల

పాములపాడు: బానకచెర్ల క్రాస్ రెగ్యులేటరు నుంచి 30,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఏఈ దేవేంద్ర శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటరు నుంచి 30వేల క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో ఉందన్నారు. కాగా ఆ నీటినంతా దిగువ కాలువలకు విడుదల చేస్తున్నామన్నారు. తెలుగుగంగ(వీబీఆర్) కాల్వకు 12,000, కేసీసీ ఎస్కేప్ చానల్‌కు 9,000, జీఎన్ఎస్ఎస్ కు 9000 క్యూసెక్కుల చొప్పున విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌లో 15 టీఎంసీలకు పైగా నీరు ఉన్నట్లు చెప్పారు.

స్వాతంత్య్ర వేడుకలకు చదువుల సుజాతమ్మ

- ప్రత్యేక అతిథుల్లో ఒకరుగా ఢిల్లీకి ఆహ్వానం



కర్నూలు(అర్బన్): జిల్లాలోని ఓర్వకల్లు మండలం పాలకొలను గ్రామ సర్పంచ్ చదువుల సుజాతమ్మకు అరుదైన అవకాశం లభించింది. ఢిల్లీలో ఆగస్టు 15న నిర్వహిస్తున్న స్వాతంత్య్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనేందుకు ప్రత్యేక అతిథిగా హాజరు కావాలని ఆమెకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ నుంచి ఆహ్వానం అందింది. పాలకొలను గ్రామ పంచాయతీలో కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు పథకాలను సంపూర్ణంగా అమలు చేయడం పట్ల ఆ గ్రామం ఉత్తమ పంచాయతీగా ఎంపికైంది. ఈ నేపథ్యంలో సర్పంచ్ సుజాతమ్మతో పాటు ఆమె భర్త చదువుల నాగ సుధాకర్‌రెడ్డికి కూడా ఢిల్లీ వేడుకల్లో పాల్గొనేందుకు అవకాశం లభించింది. ఈ మేరకు రాష్ట్ర పీఆర్‌అండ్‌ఆర్‌డీ కమిషనర్ వీఆర్ కృష్ణతేజ ఉత్తర్వులు జారీ చేశారు. రాష్ట్రంలోని ఉమ్మడి 13 జిల్లాల్లో 10 మంది సర్పంచులను ఎంపిక చేయగా, ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి పాలకొలను సర్పంచు సుజాతమ్మ ఒకరు కావడం విశేషం.

క్యూలైన్ల ఏర్పాటు పరిశీలన



దర్శన క్యూలైన్లు పరిశీలిస్తున్న పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు

మంత్రాలయం: ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంలో వచ్చే నెల 8 నుంచి రాఘవేంద్రస్వామి ఆరాధన వేడుకలు జరగనున్నాయి. లక్షలాదిగా భక్తులు ఆరాధన ఉత్సవాల్లో పాల్గొననున్నారు. ఈ నేపథ్యంలో రద్దీ దృష్ట్యా నూతనంగా క్యూలైన్ల ఏర్పాటు చేపట్టారు. నేరుగా శ్రీమఠంలోకి వెళ్లడంతో ప్రాంగణంలో భక్తుల రద్దీ తీవ్రంగా ఉండటం సమస్యగా ఉంది. సమస్యను అధిగమించేందుకు శ్రీమఠం ప్రాకారం పైభాగంలో ప్రత్యేక క్యూలైన్లు నెలకొల్పారు. శనివారం పీఠాధిపతి సుబుధేంద్రతీర్థులు క్యూలైన్ల ఏర్పాటును పరిశీలించారు. క్యూలైన్ల ఏర్పాటుతో భక్తుల దర్శన విధానాలను తెలుసుకున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా దారులు ఏర్పాటు చేయాలని శ్రీమఠం అధికారులకు పీఠాధిపతి సూచించారు. పర్యవేక్షణలో శ్రీమఠం ఈఈ సురేష్ కోనాపూర్, ఇతర సిబ్బంది ఉన్నారు.

సౌకర్యాలు దారుణం.. వసతి గండం!

- ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థులకు అందని సౌకర్యాలు
- దుప్పట్లు అందక నిద్రకు దూరమవుతున్న పిల్లలు
- నాసిరకం ఆహారం తినడంతో అనారోగ్య సమస్యలు
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- పట్టించుకోని రాష్ట్ర ప్రభుత్వం



కోవెలకుంట్ల బీసీ హాస్టల్‌లో మంచాలు లేక నేలపై నిద్రిస్తున్న విద్యార్థులు



ఎస్సీ హాస్టల్‌లో కూలేందుకు సిద్ధంగా ఉన్న వంటగది

నంద్యాల దేవనగర్‌లో అద్దె భవనంలో నిర్వహిస్తున్న బీసీ వసతి గృహంలో 30 మంది విద్యార్థులు ఉన్నారు. 'సాక్షి' విజిట్ చేయగా చిన్న గదుల్లో భోజనాలు వడ్డిస్తున్నారు. బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడ్డారు. రాత్రి 9.30గంటల సమయంలో ఇంటి వద్ద నుంచి తెచ్చుకున్న దుప్పట్లనే కప్పుకొని నిద్రించారు. బండపరుపుపై పడుకోవడంతో చలికి తట్టుకోలేక విద్యార్థులు అవస్థలు పడ్డారు.

బనగానపల్లె నియోజకవర్గం సంజామల మండల కేంద్రంలోని బీసీ సంక్షేమ హాస్టల్‌లో 85 మంది విద్యార్థులు ఉన్నారు. ఇరుకు గదులు ఉండటంతో విద్యార్థులకు అందించిన మంచాలు మూలన వేయాల్సి వచ్చింది. చాలా మంది వరండాలో నిద్రించారు. కాంపౌండ్ వాల్ లేక పందులు, పాముల సంచారం అధికమవుతోంది. నలుగురు సిబ్బంది ఉండాల్సి చోట ఇద్దరు మాత్రమే ఉండటంతో విద్యార్థులకు కనీస వసతులు అందడం లేదు.

నంద్యాల(అర్బన్): జిల్లాలోని సంక్షేమ హాస్టళ్లు సంక్షోభంలో నడుస్తున్నాయి. ప్రభుత్వాల అలసత్వం, పాలకులు పట్టించుకోకపోవడంతో సౌకర్యాలు లేమితో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. అత్యున్నత విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలతో ముందుకు సాగాల్సిన హాస్టళ్లు కుచించుకుపోతున్నాయి. విద్యార్థులు కూడా సౌకర్యాలు లేక అల్లాడిపోతున్నారు. ప్రస్తుత కాలంలో ఎక్కడ చూసినా మినరల్ వాటర్ తాగుతున్న పరిస్థితుల్లో సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నడిచే హాస్టళ్లలో శుద్ధి చేయని నీరు తాగుతున్నారు. మరుగుదొడ్ల పరిస్థితి అధ్వానంగా ఉంది. సొంత భవనాలు లేకపోవడంతో కొన్ని ప్రాంతాల్లో కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న హాస్టళ్లలో విద్యార్థులు బిక్కుబిక్కుమంటూ విద్యను అభ్యసిస్తున్నారు.

పనిచేయని ఆర్వో ప్లాంట్లు

విద్యాసంవత్సరం ప్రారంభమై రెండు నెలలు గడుస్తోంది. నంద్యాల జిల్లాలో సంక్షేమ వసతి గృహాలు, గురుకుల, కేజీబీవీ, మోడల్ స్కూల్ హాస్టళ్లు మొత్తం 137 హాస్టళ్లలో 22,200 మంది విద్యార్థులు ఉన్నారు. అన్ని వసతి గృహాల్లో పలు సమస్యలు విద్యార్థులను వేధిస్తున్నాయి. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి సమస్యల పరిష్కారానికి చొరవచూపడంలో విఫలమవుతున్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నాడు–నేడు పథకం కింద పలు సంక్షేమ హాస్టళ్లలో ఆర్వో ప్లాంట్లను ఏర్పాటు చేసింది. పాణ్యం మండలం ఎస్సీ బాలుర వసతి గృహం, సంజామల మండలం కేజీబీవీ బాలికల వసతి గృహాల్లో ఆర్వో ప్లాంట్లు మరుగున పడేశారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తుండటంతోనే ఆర్వో ప్లాంట్లను వినియోగించకుండా వదిలేసినట్లు సమాచారం. వసతి గృహాల్లో అపరిశుభ్రంగా ఉన్న చేతిపంపు, ట్యాంకుల నీటిని తాగాల్సి వస్తుందని విద్యార్థులు వాపోతున్నారు.



అవుకు బీసీ హాస్టల్‌లో మూలకు చేరిన మంచాలు

'అప్పు' తిప్పలు

సంక్షేమ వసతి గృహాల్లో మరుగుదొడ్లను శుభ్రం చేసేందుకు ఫినాయిల్, యాసిడ్ కొనేందుకు నిధులు లేవని పలువురు వార్డెన్లు గగ్గోలు పెడుతున్నారు. బడ్జెట్ ఇవ్వకపోవడంతో లైట్లు పనిచేయకపోయినా, చీపుర్లు, చిన్నచిన్న స్విచ్‌లు లాంటివి రిపేరుకొచ్చినా అలాగే వదిలేయాల్సి వస్తోందని వాపోతున్నారు. పలు వసతి గృహాల్లో వార్డెన్లు కమీషన్లకు కక్కుర్తి పడి నాసిరకం కూరగాయలు, నిత్యావసరాలు కొనుగోలు చేస్తున్నారు. మార్కెట్లో కిలో ఉల్లిపాయలు రూ.40 ఉంటే వసతి గృహాల వార్డెన్లు నాసిరకంగా విక్రయించే రూ.200కు 8 కిలోల ఉల్లిపాయలను కొనుగోలు చేస్తున్నారు. అదే విధంగా వంకాయ, దోసకాయ, టమోట, పచ్చిమిర్చి, తదితర కూరగాయలను తక్కువ ధరలకు కొనుగోలు చేస్తున్నారు. దీంతో కుళ్లిన కూరగాయలతో వంటలు చేయడంతో విద్యార్థులు పలు రకాల అనారోగ్యానికి గురవుతున్నారు.

సమస్యలు ఇవీ..

➤ మహానంది ఆశ్రమ పాఠశాలలో వసతి గదులు లేకపోవడంతో తరగతి గదుల్లో విద్యార్థులు నిద్రించాల్సి వస్తుంది. పాఠశాల ప్రాంగణంలో వర్షపునీరు నిలుస్తుండటంతో దాదాపు 150 మంది విద్యార్థులు నిద్రకు దూరం కావాల్సి వచ్చింది.

➤ అవుకు మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ శాఖ బాలుర వసతి గృహంలో విద్యార్థులు నేలపైనే నిద్రించాల్సి వస్తుంది. కాంపౌండ్ వాల్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

➤ బండిఆత్మకూరు బీసీ హాస్టల్‌లో 65 మంది విద్యార్థులకు నాలుగు గదులే ఉన్నాయి. ఒక్కో గదిలో 15 మంది విద్యార్థులకు రెండు ఫ్యాన్లు ఏర్పాటు చేశారు. ఐదు బాత్‌రూములు, ఐదు మరుగుదొడ్లు ఉన్నా సమయానికి పాఠశాలకు చేరుకునేందుకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.



బేతంచెర్లలో అందుబాటులోకి రాని హాస్టల్ భవనం

➤ ఆత్మకూరు పట్టణంలోని ఎస్సీ,ఎస్టీ, బీసీ సమీకృత వసతి గృహంలో బండ పరుపు కుంగిపోయి విద్యార్థులు నడిచేందుకు ఇబ్బందులు పడుతున్నారు.బాత్‌రూములు శుభ్రంగా లేకపోవడంతో విద్యార్థులు అనారోగ్యాలకు గురవుతున్నారు.

➤ ప్యాపిలి బీసీ వసతి గృహంలో విద్యార్థులకు తగ్గట్లు గదులు లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. భోజనాలు ఆరుబయట చేస్తున్న విద్యార్థులకు అవసరమైన గ్లాసుల ఏర్పాటు లేకపోవడంతో ప్లేట్లలోనే నీరు వంచుకొని తాగాల్సి వస్తోంది.

➤ బనగానపల్లె నియోజకవర్గంలోని ఐదు మండలాల పరిధిలో నాలుగు ఎస్సీ, ఏడు బీసీ బాలుర, బాలికల వసతిగృహాలు, నాలుగు కళాశాల హాస్టళ్లు ఉన్నాయి. కోవెలకుంట్ల, సంజామల, అవుకు బీసీ బాలుర వసతిగృహాల్లో విద్యార్థులు రాత్రి వేళల్లో నేలపై పడుకుని నిద్రిస్తున్నారు. ఆయా హాస్టళ్లలో ఈ ఏడాది ఇప్పటి వరకు దుప్పట్లు సరఫరా చేయలేదు. కిటీలకు జాలర్లు అమర్చినా దోమల బెడద అధికంగా ఉండటంతో రాత్రి వేళల్లో దోమలతో అవస్థలు పడుతున్నారు.

➤ కోవెలకుంట్ల బీసీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. హాస్టల్‌కు ప్రభుత్వం మంచాలు సరఫరా చేయకపోవడంతో నేలపైనే పడుకుంటున్నారు. వర్షాకాలంలో హాస్టల్ పరిసర ప్రాంతాల్లో వర్షపునీరు చేరి విద్యార్థులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని వసతి గృహాలకు ప్రహరీ లేకపోవడంతో రాత్రి వేళల్లో పాములు, తేళ్లు, తదితర విష సర్పాలతో విద్యార్థులు బిక్కుబిక్కుమంటు కాలం వెళ్లదీస్తున్నారు.



చాగలమర్రి ఎస్సీ హాస్టల్‌లో స్నానపు గదులు, మరుగు దొడ్లకు డోర్‌లు దెబ్బతిన్న దృశ్యం



ఆత్మకూరులో ధ్వంసమైన హాస్టల్ మెట్లు



వరండాలో భోజనం చేస్తున్న విద్యార్థులు



ప్యాపిలి బీసీ హాస్టల్‌లో కాలకృత్యాలు తీర్చుకునేందుకు ఆరుబయటకు వెళ్తున్న విద్యార్థి

నంద్యాల జిల్లాలో హాస్టళ్ల వివరాలు ఇలా..

హాస్టళ్లు	హాస్టళ్ల సంఖ్య	విద్యార్థుల సంఖ్య
ఎస్సీ వెల్ఫేర్	38	4020
బీసీ వెల్ఫేర్	33	3770
ఎస్టీ వెల్ఫేర్	13	1610
కేజీబీవీ	27	6790
గురుకులాలు	7	4110
మోడల్ స్కూళ్లు	19	1900
మొత్తం	137	22,200

గిరిజన విద్యార్థుల జీవితాలతో చెలగాటమా?

- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా



అస్వస్థకు గురైన విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

పాణ్యం: గురకుల పాఠశాలలో సౌకర్యాలు కల్పించకుండా గిరిజన విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా మండిపడ్డారు. పాణ్యం మండలం నెరవాడ మెట్ట వద్ద ఉన్న గిరిజన గురుకుల(బాలుర)పాఠశాలలో ఫుడ్‌పాయిజన్‌తో 25 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ అక్కడికి వెళ్లారు. ప్రిన్సిపాల్ క్రిష్ణానాయక్‌తో మాట్లాడారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ.. పాఠశాలలో 228 మంది విద్యార్థులు ఉన్నారని, వీరికి సురక్షిత మంచినీరు అందించాల్సిన ఆర్‌ఓ ప్లాంట్ మూలనపడిందన్నారు. నిధులు లేక మరమ్మతులు చేయలేదన్నారు. డైనింగ్‌హాల్ లేకపోవడంతో విద్యార్థులు ఆరుబయట బురదలో నిలబడి భోజనం చేయాల్సి వస్తోందన్నారు. వంట గదిలో ఒక్కరు కూడా పర్మినెంట్ వర్కర్ లేరని, ఇతర హోటల్‌లో వంట చేయిస్తున్నారన్నారు. పాఠశాలలో వైద్య సిబ్బంది అందుబాటులో లేరని, మాత్రలు కూడా లేవన్నారు. సౌకర్యాలు కల్పించకుండా గిరిజన విద్యార్థుల జీవితాలతో కూటమి ప్రభుత్వం చెలగాటమాడుతోందని విమర్శించారు. ఇదిలా ఉండగా పాఠశాల వద్ద విద్యార్థి సంఘాల నాయకులు ధర్నా నిర్వహించారు. ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏఐఎఫ్‌బీ వెంకటాద్రి, ఎస్ఎఫ్ఐ ప్రతాప్, ఎఐవైఎల్ చిరంజీవి, ఏపీఎస్ఎఫ్ సురేంద్ర, ఆర్‌వీఎఫ్ రవీంద్ర పాల్గొన్నారు.

'స్పౌజ్' పింఛన్లు లేనట్లే!

- జిల్లాలో 2,462 మందికి ఇస్తామంటూ రెండు నెలల క్రితం ప్రచారం
- ఇప్పటి వరకు అందించని వైనం

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలకు, ఆచరణకు పొంతన ఉండటం లేదు. ఏదైనా కేటగిరిలో పింఛన్ పొందుతున్న భర్త మృతి చెందితే అతని భార్యకు స్పౌజ్ పింఛన్ ఇస్తామని ప్రభుత్వం చెప్పింది. జిల్లాలో 2,462 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరు చేసినట్లు ప్రకటించారు. జూన్ నుంచి మంజూరు చేస్తామని హడావుడి ప్రచారాలు చేశారు. లబ్ధిదారులు ఎంతో ఆశపడ్డారు. డబ్బులు చేతికి అందే సమయానికి వెనక్కు వెళ్లాయంటూ సచివాలయ సిబ్బంది చెప్పడంతో నిరాశ చెందుతున్నారు.

రిక్త హస్తం

కూటమి అధికారం చేపట్టిన తర్వాత కొత్త పింఛన్ల మంజూరు చేయలేదు. కనీసం అర్హుల నుండి దరఖాస్తులు కూడా స్వీకరించిన సంగతే లేదు. మూడు నెలల క్రితం స్పౌజ్ కేటగిరి పేరుతో వితంతు పింఛన్లు మంజూరు అంటూ అర్హులు దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఎవరైనా వ్యక్తి ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పొందుతూ డిసెంబర్ 2023 నుంచి అక్టోబర్ 2024 మధ్య చనిపోతే అతని భార్యను స్పౌజ్ కేటగిరి కింద అర్హురాలిగా గుర్తిస్తామని చెప్పారు. జిల్లాలో 3,255 మంది దరఖాస్తు చేసుకున్నారు. మే చివరిలో జూన్ మొదటి వారంలో, జూలై మొదటి వారంలో ఇస్తామంటూ చెప్పారు. తీరా ప్రభుత్వం మొండి చేయి చూపించింది. జిల్లాలో ప్రస్తుతం 2,12,377 మందికి పింఛన్లు అందుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పోలిస్తే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వివిధ కారణాలతో 9 వేల వరకు పింఛన్లు తగ్గిపోయాయి.

ప్రభుత్వం మాట నిలబెట్టుకోవాలి

గత ఏడాది నా భర్త చనిపోయాడు. ఆయనకు పింఛన్ వస్తుంది. స్పౌజ్ కేటగిరి కింద పింఛన్ మంజూరు చేస్తున్నారు. సచివాలయంలో దరఖాస్తు చేసుకున్నా ఇంత వరకు మంజూరు కాలేదు. పింఛన్ ఇచ్చి ఆదుకోవాలి.

–రమణమ్మ, నంద్యాల

కూలీల శ్రమను దోచుకోవడం దారుణం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



మాట్లాడుతున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: ఉపాధి హామీ పథకం పనుల్లో కూలీల శ్రమను దోచుకోవడం దారుణమని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ కారపాకుల నాగవేణి అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఫీల్డ్ అసిస్టెంట్ తమ సంతకాన్ని ఫోర్జరీ చేశారని బి ఉప్పలూరు సర్పంచ్ ఈశ్వరయ్య సభలో ప్రస్తావించగా..జెడ్పీచైర్మన్ స్పందించారు. సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన వారిపై విచారణ చేసి, కేసు నమోదు చేయాలని ఏపీఓకు సూచించారు. రబీ సీజన్‌లో కొలిమిగుండ్లను కరువు మండలంగా గుర్తించినా రైతులకు ప్రభుత్వం నుంచి సాయం అందకపోవడంపై జెడ్పీచైర్మన్ ఆరాతీశారు. చాలా మంది తల్లుల ఖాతాల్లో తల్లికి వందనం డబ్బులు రూ.8 వేలు, రూ.9వేలు మాత్రమే జమ అయ్యాయని కొందరు చెప్పగా.. తప్పుడు సమాచారం ఇస్తున్నారని ఎంఈఓ అనడంతో జెడ్పీచైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని సూచించారు. ముందస్తు ప్రణాళిక లేకనే నీటి సమస్య వస్తోందని, తగిన చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ఆదేశించారు. రైతు సేవా కేంద్రాల్లో యూరియా,మందులు రావడం లేదని, తిమ్మనాయినపేట వద్ద దేవదాయ మాన్యం భూముల్లో మట్టిని తవ్వుకొని తీసుకెళ్తున్నారని సభ్యులు సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. జిల్లా సరిహద్దు నుంచి 544–డీ జాతీయ రహదారి ఎలైన్‌మెంట్ విషయంలో రెండు చోట్ల మార్పులు చేయాల్సి ఉందని కోరారు. సభ్యులతో తీర్మానం చేసి ఎన్‌హెచ్ అధికారులకు పంపాలని ఎంపీడీఓ ప్రసాదరెడ్డికి జెడ్పీ చైర్మన్ సూచించారు.

మీ సాయం.. నిలుపుతుంది ప్రాణం

- తొమ్మిదేళ్ల క్రితం చిన్ని గుండెకు పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్
- గడువు తీరడంతో కొత్తది అమర్చాల్సిన అవసరం
- పేద తల్లిదండ్రులు దాతల కోసం నిరీక్షణ



తల్లిదండ్రులు గోవిందు, శివమ్మతో ప్రణీత్

జూపాడుబంగ్లా: చిత్రంలో తల్లిదండ్రులు శివమ్మ, గోవిందుతో కనిపిస్తున్న బాలుడి పేరు ప్రణీత్(10). ప్రస్తుతం ఐదో తరగతి చదువుతున్నాడు. సొంతూరు జూపాడుబంగ్లా. ఈ బాలుడి గుండెకు పెద్ద కష్టమే వచ్చింది. పుట్టిన ఏడాదికే ప్రణీత్‌కు తీవ్ర జ్వరం రావడంతో కర్నూలులోని వైద్యులకు చూపించగా గుండె సంబంధిత సమస్య ఉన్నట్లు గుర్తించారు. హార్ట్‌బీట్ 70 నుంచి 80 ఉండాల్సి ఉండగా కేవలం 30 మాత్రమే ఉన్నట్లు తేల్చారు. వైద్యుల సూచన మేరకు హైదరాబాద్ కిమ్స్ ఆసుపత్రికి వెళ్లగా అక్కడ వైద్యులు పేస్‌మేకర్ ఇంప్లాంటేషన్ అమర్చారు. ఆపరేషన్ అనంతరం ప్రతి నెలా హైదరాబాద్‌కు వెళ్లి వైద్య పరీక్షలు చేయించుకుంటున్నారు. ఇందు కోసం నెలకు రూ.10 వేల నుంచి రూ.20 వేల దాకా ఖర్చు అవుతోంది. కూలీ పనులకెళ్లే శివమ్మ, గోవిందు దంపతులకు గురుప్రసాద్, ప్రణీత్, సౌమ్య సంతానం. ఉన్నంతలో సాఫీగా సాగిపోతున్న వీరి సంసారంలో చిన్న కొడుకు ప్రణీత్ ఆరోగ్య సమస్య పెద్ద కష్టంగా మారింది. ప్రస్తుతం ప్రణీత్ గుండెకు అమర్చిన పేస్‌మేకర్ గడువు తీరడంతో హార్ట్‌బీట్ తగ్గిపోతుంది. మరో నెలరోజుల్లోగా శరీరంలోని పేస్‌మేకర్ మార్చకపోతే బాలుడి ప్రాణాలకు ముప్పు ఉందని వైద్యులు చెబుతున్నారు. అయితే తొమ్మిదేళ్ల క్రితం ఈ ఆపరేషన్ తెలంగాణలో ఏపీ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా చేశారు. ప్రస్తుతం కార్డు చెల్లుబాటు కావడం లేదు. అలాగే పేస్‌మేకర్ రీప్లేస్‌మెంట్ ఏపీలో కూడా ఆరోగ్యశ్రీ పరిధిలో లేకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. రూ.5లక్షల వరకు ఖర్చు అవుతుందని కిమ్స్ ఆసుపత్రి వైద్యులు చెప్పారని, రాష్ట్ర ప్రభుత్వం, దాతలు స్పందించి ఆపరేషన్ చేయించి తమ బిడ్డను కాపాడాలని పేద తల్లిదండ్రులు వేడుకుంటున్నారు.



చదువుకుంటున్న ప్రణీత్

క్లుప్తంగా

నేటి నుంచి డిపార్ట్‌మెంటల్ టెస్టులు

కర్నూలు (సెంట్రల్): ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి ఆగస్టు 1వ తేదీ వరకు డిపార్ట్‌మెంటల్ టెస్టును నిర్వహిస్తున్నట్లు డీఆర్వో, జిల్లా కోఆర్డినేటర్ సి.వెంకట నారాయణమ్మ తెలిపారు. శనివారం డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు సంబంధించి తన కార్యాలయంలో జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లాలో రెండు కేంద్రాల్లో నిర్వహించే పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తుతో పాటు అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు.

నానో యూరియాను వినియోగించండి

కర్నూలు (సెంట్రల్): యూరియాకు బదులుగా నానో యూరియాను పంటలపై పిచికారీ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి.నవ్య రైతులకు సూచించారు. ఎకరాకు 500 ఎం.ఎల్ వాడితే సరిపోతుందని, దీని ధర కూడా రూ.225 ఉంటుందని, జిల్లాలోని అన్ని వ్యవసాయ సబ్ డివిజన్ సహాయ సంచాలకుల కార్యాలయాల్లో నానో యూరియా అందుబాటులో ఉంటుందని చెప్పారు. కాగా, ఈనెల 26వ తేదీ నాటికి జిల్లాలో 1140 మెట్రిక్ టన్నుల యూరియా లభ్యతగా ఉందని, రైతు సోదరులు యూరియా విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు.

ఆక్రమణల తొలగింపు

కర్నూలు (టౌన్): నగరంలో ఆక్రమణలను తొలగిస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ వెల్లడించారు. శనివారం స్థానిక బండిమెట్ట మున్సిపల్ పాఠశాల వద్ద రహదారిని ఆక్రమించి ఏర్పాటు చేసిన 14 షాపులను పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తు రహదారులను ఆక్రమించడం సరి కాదన్నారు. ప్రతి ఒక్కరూ నగరాభివృద్ధికి సహకరించాలన్నారు. కార్యక్రమంలో సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, టీపీఎస్ అంజాద్ బాషా, బిల్డింగ్ సూపర్‌వైజర్ మధుగోపాల్, ప్లానింగ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

గుంటికంటి రంగస్వామికి జలాభిషేకం





తుంగభద్ర జలాలతో ఊరేగింపుగా వెంకటాపురం కాలనీ వాసులు (ఇన్‌సెట్) పూజలందుకున్న గుంటి రంగస్వామి

ఎమ్మిగనూరు పురపాలక సంఘ పరిధిలోని వెంకటాపురంలో స్వయంభూగా వెలసిన గుంటి రంగస్వామికి జలాభిషేకం చేశారు. ఏటా శ్రావణ మాసంలో గుంటి రంగస్వామికి తుంగా జలాలతో అభిషేకం చేయడం ఆనవాయతీగా వస్తోంది. ఈ మేరకు శ్రావణమాసం మొదటి శనివారం వెయ్యి మందికిపైగా 25 కిలో మీటర్ల దూరంలోని తుంగభద్ర నదికి పాదయాత్రగా వెళ్లారు. అక్కడ పూజలు చేసి తుంగా జలాలతో గోవింద నామస్మరణ చేసుకుంటూ గ్రామానికి చేరుకున్నారు. ఈ సమయంలో గ్రామంలో ఆలయం వరకు నేలపై పడుకున్న మహిళా భక్తులపై నుంచి తుంగా జలాలు తీసుకొచ్చిన వారు మంగళవాయిద్యాలతో నడుచుకుంటూ వెళ్లారు. అనంతరం ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి స్వయంభూ విగ్రహ రూపంలో ఉన్న స్వామివారికి ప్రత్యేక పూజతో జలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బజారి, గ్రామ పెద్దలు నీలకంతారెడ్డి, మేస్త్రీ నాగన్న, పాండురంగ, ఈరన్న, ఆనంద్‌తో పాటు పెద్దలు పాల్గొన్నారు. – ఎమ్మిగనూరు



నేలపై పడుకున్న మహిళా భక్తులపై నదీ జలాలతో ఆలయానికి చేరుకుంటున్న దృశ్యం





స్నాతకోత్సవానికి హాజరైన విద్యార్థిని, విద్యార్థులు , విద్యార్థినికి గోల్డ్ మెడల్ అందిస్తున్న జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శన్ రావు తదితరులు

ఘనంగా స్నాతకోత్సవం

కర్నూలు సిటీ: స్థానిక జి.పుల్లయ్య ఇంజినీరింగ్ కాలేజీలో నాల్గొవ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య హెచ్.సుదర్శనరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2021–25 బ్యాచ్ బీటెక్, 2023–25 బ్యాచ్ ఎంబీఏ విద్యార్థిని, విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ పట్టాలను వీసీ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ.. గ్రాడ్యుయేషన్ పూర్తి చేసుకున్న విద్యార్థులు జీవితంలో ఏ స్థాయికి చేరుకున్నప్పటికీ తల్లిదండ్రుల త్యాగాలను విస్మరించకూడదన్నారు. బీటెక్‌లో ఏ బ్రాంచ్‌లో చదివినా విషయ పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకున్నప్పుడే ఏదైనా సాధిస్తారని సూచించారు. కృత్రిమ మేధా కన్నా మానవ మేధనే గొప్పదన్నారు. క్వాంటం కంప్యూటరింగ్ రాబోయే రోజుల్లో అన్ని బ్రాంచ్‌ల్లో ఉంటుందని, రాష్ట్ర ప్రభుత్వం ఆసియాలోనే మొట్టమొదటిసారి అమరావతిలో నెలకొల్పబోతుందన్నారు. జేఎన్‌టీయూ పరిధిలో జి.పుల్లయ్య కాలేజీ అత్యుత్తమ విద్యను అందిస్తుందన్నారు. రవీంద్ర విద్యా సంస్థల వ్యవస్థాపకులు జి.పుల్లయ్య మాట్లాడుతూ.. జీవితానికి పునాదులు పడే కాలేజీ దశలో శ్రద్ధగా చదువుకోవాలన్నారు. అనంతరం రవీంద్ర విద్యా సంస్థల చైర్మన్ జీవీఎం మోహన్ కుమార్ మాట్లాడారు. కాలేజీలో వివిధ బ్రాంచ్‌ల్లో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులకు గోల్డ్ మెడల్ అందజేశారు. కార్యక్రమంలో ఆ కాలేజీలోని అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గులాబీ రంగు పురుగు ఉద్ధృతిని నివారించాలి

నంద్యాల(అర్బన్): పత్తి పంటను ఆశించిన గులాబీ రంగు పురుగు ఉద్ధృతిని నివారించాలని ఆర్‌ఏఆర్ఎస్ ఏడీఆర్ జాన్సన్ తెలిపారు. ఎకరాకు నాలుగు లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడమే కాకుండా క్లోరిపైరీపాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. స్థానిక కార్యాలయంలో శనివారం శిక్షణ, సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఖరీఫ్‌లో పంటల సాగు, ప్రస్తుతం రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై శాస్త్రవేత్తలు, వ్యవసాయాధికారులతో చర్చించారు. అనంతరం ఏడీఆర్ జాన్సన్ మాట్లాడుతూ.. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు పంటలు తీవ్రంగా నష్టపరిచే అవకాశం ఉందని, పొలాల్లో నీరు లేకుండా సాఫీగా వెళ్లేలా చూడాలన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ అశోక్‌కుమార్, శివరామకృష్ణ, వెంకటరమణ, డీడీఏ మద్దిలేటి, కర్నూలు ఏడీఏ రాజశేఖర్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏడీఆర్ జాన్సన్

అనారోగ్యంతో ఇద్దరు మాజీ సైనికుల మృతి

కర్నూలు(అర్బన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఇద్దరు మాజీ సైనికులు అనారోగ్యంతో మృతి చెందినట్లు జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నంద్యాల ఎస్‌జీటీ కాలనీలో నివాసం ఉంటు ఎస్‌బీఐలో ఉద్యోగం చేస్తున్న శశికుమార్ (55) గుండెపోటుతో మృతి చెందారన్నారు. ఈయన మద్రాసు 28 రెజిమెంట్‌లో నాయక్ ర్యాంక్‌లో 20 సంవత్సరాలు విధులు నిర్వహించారన్నారు. అలాగే ... కర్నూలు మాధవీనగర్ మహావీర్ కాలనీలో నివాసం ఉంటున్న నాయక్ వి. దేవదానం కూడా అనారోగ్యంతో మృతి చెందారన్నారు. ఈయన మద్రాస్ రెజిమెంట్ 5లో 17 ఏళ్ల విధులు నిర్వహించారన్నారు. మృతి చెందిన ఇద్దరు మాజీ సైనికుల కుటుంబాలకు ప్రగాఢ సంతాపాన్ని వ్యక్తం చేస్తున్నామన్నారు. వీరి కుటుంబ సభ్యులకు సంఘం ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.



శశికుమార్ (ఫైల్)

మాజీ సైనికులకు సన్మానం

కర్నూలు(అర్బన్): కార్గిల్ యుద్ధంలో అమరులైన సైనికులను స్మరించుకుంటూ మాజీ సైనికులను సన్మానించారు. శనివారం స్థానిక సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో కార్గిల్ విజయ్ దివస్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్ మాట్లాడుతూ.. 1999 కార్గిల్ యుద్ధంలో విజయం సాధించిన నేపథ్యంలో 26వ వార్షికోత్సవాన్ని దేశమంతటా జరుపుకుంటున్నామన్నారు. జమ్ము కాశ్మీర్‌లోని కార్గిల్ సెక్టార్‌లో నియంత్రణ రేఖ వెంబడి శత్రు సైన్యం భారత భూభాగంలోకి ప్రవేశించినప్పుడు మే 1999లో కార్గిల్ యుద్ధం ప్రారంభమైందన్నారు. అప్పట్లో ఈ యుద్ధాన్ని ఆపరేషన్ విజయ్‌గా ప్రకటించారన్నారు. ఈ యుద్ధంలో అమరులైన వీర సైనికుల జ్ఞాపకార్థం ఆపరేషన్ విజయ్‌లో పాల్గొన్న మాజీ సైనికులను శాలువాలు, మొమెంటోలతో సన్మానించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పర్యవేక్షకురాలు మహేశ్వరమ్మ, జిల్లా మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షులు నర్రా పేరయ్య, కార్యదర్శి ఎం సుధాకర్, కోశాధికారి నజీర్ అహమ్మద్, రాముడు, సింగ్ తదితరులు పాల్గొన్నారు.



సన్మానం పొందిన మాజీ సైనికులతో జిల్లా సైనిక సంక్షేమాధికారి ఎస్ఆర్ రత్నరూత్

మూడు ఆలయాల్లో చోరీ

ఎమ్మిగనూరురూరల్: ఎమ్మిగనూరు- కర్నూలు ప్రధాన రహదారిలో పట్టణానికి సమీపంలోని మూడు ఆలయాల్లో చోరీ జరిగింది. శుక్రవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు బాటమారెమ్మ అవ్వ దేవాలయంలో హుండీని ధ్వంసం చేసి కానుకలు అపహరించారు. అలాగే సిరాలదొడ్డి గ్రామానికి వెళ్లే దారిలో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి దేవాలయంలో హుండీని పగలగొట్టి అందులో ఉండే రూ.12 వేల విలువ చేసే నగదు, వస్తువులను దొంగలించారు. అలాగే ఎర్రకోట సమీపంలోని ఆంజనేయస్వామి ఆలయ హుండీని పగలగొట్టి చిల్లర తీసుకెళ్లాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాసులు శనివారం తెలిపారు.

వ్యక్తి ఆత్మహత్య

కోవెలకుంట్ల: మండలంలోని కలుగొట్లకు చెందిన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. శనివారం రేవనూరు ఎస్ఐ భూపాలుడు అందించిన సమాచారం మేరకు.. గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి(40) పదేళ్ల క్రితం భార్య చనిపోవడంతో మనోవేదనతో మద్యానికి బానిసయ్యాడు. ఇటీవల అనారోగ్యానికి గురి కావడంతో చికిత్స నిమిత్తం నంద్యాలకు వెళ్లగా రెండు కిడ్నీలు దెబ్బతిన్నాయని డాక్టర్లు చెప్పడంతో మనస్తాపం చెందాడు. జీవితంపై విరక్తి చెంది ఈ నెల 22వ తేదీన ఇంటి వద్ద క్రిమిసంహారక మందు తాగి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. మృతుని తండ్రి నాగేశ్వరరెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కొండ ముచ్చుల దాడి

ప్యాపిలి: జలదుర్గం గ్రామంలో శనివారం కొండముచ్చులు గ్రామస్తులపై దాడి చేశాయి. గత కొద్ది రోజులుగా ఇతర ప్రాంతాల నుంచి గుర్తు తెలియని వ్యక్తులు గ్రామంలో కొండముచ్చులను వదిలివెళ్లారు. అప్పటి నుంచి గ్రామంలో కొండముచ్చులు స్వైరవిహారం చేస్తూ బెంబేలెత్తిస్తున్నాయి. శనివారం గ్రామానికి చెందిన రంగనాయకులు, మల్లేశ్వరయ్య, ఓబులేసు, కంబయ్య, బాషా తదితరులపై దాడి చేసి గాయపర్చాయి. గాయపడిన వారిని స్థానిక పీహెచ్‌సీలో చికిత్స అందించారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కొండముచ్చులను బంధించి అటవీ ప్రాంతానికి తరలించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



కొండముచ్చు దాడిలో గాయపడిన వ్యక్తి

4.25 కిలోల బరువుతో మగ శిశువు జననం

కోడుమూరు రూరల్: కోడుమూరు ప్రభుత్వాసుపత్రిలో ఓ మహిళ సాధారణ కాన్పులో 4.25 కిలోల బరువు ఉన్న పండంటి మగ శిశువుకు జన్మనిచ్చింది. గోనెగండ్ల మండలం వేముగోడు గ్రామానికి చెందిన భారతి, నల్లన్న దంపతులకు ఇదివరకే ఇద్దరు మగ పిల్లలు ఉన్నారు. మూడో కాన్పు నిమిత్తం శనివారం తెల్లవారుజామున కోడుమూరు ఆసుపత్రికి చేరుకున్నారు. ఆరోగ్య పరీక్షలు చేసిన గైనకాలజిస్ట్ పుష్పలత ఆ మహిళకు సాధారణ కాన్పు చేయగా 4.25 కిలోల బరువుతో మగ శిశువు జన్మించాడు. అప్పుడే శిశువులు మూడున్నర కిలోల వరకు బరువు ఉండటం సహజం కానీ.. ఈ శిశువు ఏకంగా 4.25 కిలోల బరువు ఉండడం విశేషమని వైద్యాధికారి డాక్టర్ నాగరాజు అన్నారు.



శిశువుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్ నాగరాజు

ఉపాధ్యాయుల ఆందోళన

కర్నూలు (సిటీ): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో శనివారం డీఈఓ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా చేపట్టారు. ధర్నాలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రవికుమార్, నవీన్ పాటి, జిల్లా ఉపాధ్యక్షులు హేమంత్ కుమార్ పాల్గొని ప్రసంగించారు. గత నెలలో విద్యాశాఖ నిర్వహించిన ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలు అయిన వారికి ఇంతవరకు వేతనాలు రాలేదన్నారు. తక్షణమే టీచర్ల పొజిషన్ ఐడీలు ఇచ్చి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారన్నారు. ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే ఉపాధ్యాయులపై యాప్‌ల భారం తగ్గిస్తామని చెప్పారని, కానీ ఆ భారం మరింత పెంచేలా ప్రస్తుత యాప్ ఉందని, వెంటనే ఆ యాప్‌లన్నింటినీ రద్దు చేసి ఉపాధ్యాయులను కేవలం బోధనలకు మాత్రమే పరిమితం చేయాలన్నారు. బోధనేతర పనులకు ఉపాధ్యాయులను వినియోగించుకోకుండా ఆ పనులు చేసేందుకు కావలసిన సిబ్బందిని విద్యాశాఖ నియామకాలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఇబ్రహీం, బాబు, సర్వేశ్వర రెడ్డి, మనుమంతు, కిషోర్, షఫీవుల్లా, కాంతారావు, రాముడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.



డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న యూటీఎఫ్ నాయకులు